మోడల్‌గా గదుల కేటాయింపు..

ఆదాయ మార్గం ఉన్నా ప్రయోజనం సున్నా!

- ఇల్లెందు మోడల్ మార్కెట్ నిర్మాణానికి ఏడాది
- రూ. 8 కోట్లతో 8 నెలల్లో పూర్తి చేయాల్సిన భవనానికి ఐదేళ్లు
- అయినా లబ్ధిదారులకు కేటాయించని గదులు


నిర్మాణం పూర్తయిన గదులు


గదుల కేటాయింపులకు నోచుకోని మోడల్ మార్కెట్

ఇల్లెందు: ఇల్లెందు మోడల్ మార్కెట్ పూర్తయి ఏడాది అయింది. చివరి పనులకు నిధులు లేక గదులు కేటాయింపులకు నోచుకోలేదు. వాడకం లేకపోవటంతో గదులు పశువులకు నిలయంగా మారాయి. పట్టణ నడిబొడ్డున ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మోడల్ మార్కెట్‌లో గ్రౌండ్ ఫ్లోర్‌లో 96 గదులు, పై అంతస్తులో 90 గదులు నిర్మాణం చేశారు. అయితే గత ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవటంతో పనులు నత్తనడకనసాగాయి. ప్రస్తుతం గదులు నిర్మాణం పూర్తయినా కేటాయింపులు చేయడం లేదు. ఇందుకు చిన్న చిన్న పనులు చేపట్టాలని కారణాలు చూపుతున్నారు. దీంతో ప్రతీ నెలా మున్సిపాలిటీ కిరాయి రూపేనా లక్షల్లో ఆదాయం కోల్పోతోంది. 40 ఏళ్ల క్రితం నిర్మించిన మార్కెట్‌ను కూలదోసి దాని స్థానంలో నూతన మార్కెట్ నిర్మించారు. మార్కెట్ అందుబాటులోకి వస్తే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అతి పెద్ద మార్కెట్‌గా ఇల్లెందు మారనుంది. పట్టణ నడిబొడ్డున రూ. 8 కోట్లతో 186 గదులతో అందుబాటులోకి వస్తే రోడ్డు మీద ఒక్క కూరగాయల వ్యాపారి కనిపించడు. ఇక ఎండకు ఎండి, వానకు తడవాల్సిన అవసరం లేదు.

శంకుస్థాపనకు ఐదేళ్లు పూర్తి..

2019 ఆగస్టు 04న మోడల్ మార్కెట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఐదేళ్లు పూర్తయినా అందుబాటులోకి రాలేదు. టీయూఎఫ్ఐడీసీ ఫండ్స్‌తో రూ.8 కోట్లతో మోడల్ మార్కెట్ చేపట్టారు. ఎనిమిది నెలల్లో పూర్తి చేయాల్సి ఉండగా ఐదేళ్లు గడిచిపోయింది. ఏటా గడువు పొడిగిస్తున్నారు. మార్కెట్ భవనాల్లో కింద అంతస్తులో 96 గదులు, పై అంతస్తులో 90 గదులు నిర్మించారు. ఇంకా టాయిలెట్లు, వాటర్ సరఫరా, పార్కింగ్ ఏర్పాటు చేయాల్సి ఉంది.

నోచుకోని గదుల కేటాయింపు..

ఇల్లెందు మున్సిపాల్టీకి ఆదాయ మార్గం ఉన్నా ప్రయోజనం సున్నా అన్నట్లు తయారైంది. 186 గదుల షాపింగ్ కాంప్లెక్సులు అద్దెకు ఇస్తే లక్షల ఆదాయం లభిస్తుంది. పట్టణ నడిబొడ్డున వ్యాపారులు ఎండకు ఎండి వానకు తడుస్తున్నారు. ఇక మున్సిపాల్టీలో పని చేసే కార్మికులు నెలలకు నెలలు వేతనాలు లేక అల్లాడుతున్నారు. ఈ తరుణంలో తయారుగా ఉన్న కాంప్లెక్సులను కేటాయిస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

మార్కెట్ సదుపాయం లేక ఇక్కట్లు..



పట్టణ నడిబొడ్డున కోట్ల రుపాయలతో చేపట్టిన మార్కెట్ నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయకపోవటం వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడి వ్యాపారులకు సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మున్సిపల్ పాలకులు సదుపాయల మీద దృష్టి సారించటం లేదు.

– వజ్జా సురేష్, ఇల్లెందు

అధికారులు శ్రద్ధ తీసుకోవాలి..



ఐదేళ్లుగా పట్టణంలో చేపడుతున్న మోడల్ మార్కెట్ పనులు పట్టణవాసులను ఊరిస్తున్నాయి. గదుల నిర్మాణం పూర్తయింది. కేటాయింపులు సాగకపోవటం వల్ల చిరు వ్యాపారులు తీవ్ర అసాకర్యానికి గురవుతున్నారు. పాలకవర్గం అధికారులు శ్రద్ధ తీసుకుని వేగంగా పూర్తి చేయాలి.

– ఏ.సాంబ, ఇల్లెందు

వృథాగా ఆదాయం..



మున్సిపాల్టీకి ఆదాయ మార్గం ఉన్నా ఉపయోగించుకోవటం లేదు. మున్సిపాలిటీలో పని చేసే కార్మికులు నెలలకు నెలలు వేతనాలు లేక అర్ధాకలితో అలమటిస్తున్నారు. షాపింగ్ కాంప్లెక్సులు అద్దెకు ఇస్తే లక్షల ఆదాయం వస్తుంది. తక్షణం గదులను వ్యాపారులకు కేటాయించాలి.

– యాకుబ్‌షావలీ, కార్మిక నాయకుడు, ఇల్లెందు

త్వరలో ఉపయోగంలోకి..



మోడల్ మార్కెట్ నిర్మాణం పూర్తయింది. కేవలం ప్రహరీ, టాయిలెట్లు నిర్మించాల్సి ఉంది. ఈ పనులను స్వచ్ఛ భారత్‌లో పెట్టి పూర్తి చేస్తాం. ఈ లోగా మున్సిపాల్టీ తీర్మాణం చేసి టెండర్‌లో గదులు కేటాయిస్తాం.. అతి వేగంగా ఉపయోగంలోకి వచ్చేలా కృషి చేస్తాం.

– నవీన్, ఇల్లెందు మున్సిపాలిటీ కమిషనర్

క్లుప్తంగా

విలువిద్య విజేతకు సన్మానం


తేజశ్వినిని సన్మానిస్తున్న దృశ్యం

టేకులపల్లి: విలువిద్యలో రాష్ట్ర స్థాయి బంగారు పతకం సాధించిన విద్యార్థినికి ఆదివారం చుక్కాలబోడు గ్రామంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన పడియా సైదులు విజయ దంపతుల కుమార్తె తేజశ్విని కొత్తగూడెంలోని ఏకలవ్య పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. ఈ మేరకు ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి విలువిద్య పోటీల్లో తొలిసారి పాల్గొని బంగారు పతకం సాధించి విశేష ప్రతిభను కనబరిచింది. ఈ మేరకు హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్ భూక్య గంగా బాయి ఆధ్వర్యంలో సన్మానించి ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో భూక్య దళ్‌సింగ్‌నాయక్, రెడ్డి, రవి, రమేష్, రాజు, సైదులు, మంగీలాల్, భీక్య, దేవి, లక్ష్మీ, హుసేన, రవీందర్‌సింగ్ పాల్గొన్నారు.

బీఎస్పీ కమిటీ ఎన్నిక


నూతన కమిటీతో నాయకులు

టేకులపల్లి: బహుజన సమాజ్ పార్టీ ఇల్లెందు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాదావత్ ప్రతాప్ ఆధ్వర్యంలో నియోజకవర్గ అధ్యక్షుడు అజ్మీర వెంకన్న అధ్యక్షతన మండల నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా కాళ్ల రంజిత్, ఉపాధ్యక్షుడిగా పూనెం రాకేష్ దొర, కార్యదర్శులుగా బోడ వంశీ, సరికొండ వెంకటేష్, కోశాధికారిగా కుక్క ముడి ప్రసాద్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ... యువతరం రాజకీయాల్లోకి వచ్చి పేద ప్రజలను ప్రగతి పథంలో నడిపించాలని కోరారు. పేద ప్రజల కోసం అహర్నిశలు పట్టుదలతో కష్టపడి పార్టీని ముందుకు తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిప్పలపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జూలూరుపాడు: వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్‌ను ఆదివారం వైరా మండలం సిరిపురం గ్రామంలో కాకర్ల ఎంపీటీసీ సభ్యుడు పొన్నెకంటి సతీష్ కుమార్, సొసైటీ వైస్ చైర్మన్ చీమలపాటి భిక్షం, చెరుకుమళ్ల నవీన్‌లు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు కాకర్లలో సీసీ రోడ్లు, శ్రీసంతాన వేణుగోపాలస్వామి దేవాలయం వరకు సిమెంటు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

సంతాపం..

మండలంలోని కరివారిగూడెం గ్రామ పంచాయతీ తవిసిగుట్టతండాకు చెందిన బోడా తులశ్యా ఇటీవల మృతి చెందాడు. ఆదివారం తులశ్యా దశదిన కర్మ కార్యక్రమానికి వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ హాజరై తులశ్యా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. కరివారిగూడెం సర్పంచ్ బోడా శాంతిరామ్, కాంగ్రెస్ నాయకులు వేల్పుల నరసింహారావు, తోట శ్రీను, బోడా భీమారావు, భాస్కర్, కృష్ణ ప్రసాద్, బోడా గణేష్ బాబు, బాబులాల్, ధరావత్ లక్ష్మీనారాయణ, తాటికొండ ప్రసాద్, వడ్డే రాంబాబు, గుగులోత్ శంకర్ పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో పతకాలు

పాల్వంచ: ఈనెల 27వ తేదీన సంగారెడ్డి జిల్లాలో జరిగిన వరల్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్వంచకు చెందిన మా జిమ్‌కు పతకాలు వరించాయి. వివిధ జిల్లాల నుండి పాల్గొన్న ఈ పోటీల్లో జిల్లా నుండి పాల్వంచ మా జిమ్ కోచ్ బి.శ్రీను, బి.కరుణకుమార్, సామ్రాట్, చంటిలు విజేతలుగా నిలిచి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ఆదివారం పలువురు అభినందించారు.


పతకాలు సాధించిన జిమ్ సభ్యులు

సమస్యల పరిష్కారానికే అసోసియేషన్ ఏర్పాటు

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణలోని ఆల్ సీనియర్స్ సిటిజెన్స్‌ల సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ ఏర్పాటు చేశామని సంఘం రాష్ట్ర నాయకురాలు సావిత్రి, సెక్రటరీ సత్యనారాయణ అన్నారు. ఆదివారం కొత్తగూడెం పట్టణంలోని ఏ పవర్‌బస్తీలో తెలంగాణ ఆల్ సీనియర్స్ సిటిజన్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పిల్లలను పెంచి పెద్దచేసిన తల్లిదండ్రులను వారి వృద్ధాప్యంలో మంచిగా చూసుకోవాల్సిన పిల్లలు వారిని ఇబ్బందులు పెడుతున్నారని, వారి పేర్లమీద ఏమైన ఆస్తులు ఉంటే వాటిని రాయించుకొని బయటికి వెళ్లగొడుతున్నటు వంటి సమస్యలను అసోషియేషన్‌లో పరిష్కరించేందుకు ప్రయత్నించాలన్నారు. ఈ సందర్భంగా అడ్‌హక్ కమిటీ వేశారు. కన్వీనర్‌గా పిండి జయరామ్, జనరల్ సెక్రటరీగా అప్పాల రామస్వామి, జాయింట్ సెక్రటరీగా సీతారాములు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అల్లి మోహన్‌రావు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు


గుంతలను పూడుస్తున్న యువకులు

జూలూరుపాడు: మండలంలోని సాయిరాంతండా గ్రామం వద్ద తల్లాడ–కొత్తగూడెం ప్రధాన రహదారి గుంతలు ప్రమాదకరంగా ఉండటంతో యువకులు ఆదివారం మరమ్మతులు చేశారు. రహదారిపై గుంతలమయంగా ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో సాయిరాంతండా సర్పంచ్ ధరావత్ రోజా, బాలోజీ దంపతులు, కానిస్టేబుళ్లు హాళావత్ నరేష్, గణేష్‌ల ఆర్థికసాయంతో యువకులు రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంతలను పూడ్చారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ, ఆరోగ్యం


బహుమతులు అందజేస్తున్న సాబీర్‌పాషా

సింగరేణి(కొత్తగూడెం): ఆత్మరక్షణ, ఆరోగ్యానికి మార్షల్ ఆర్ట్స్ దోహదం చేస్తాయని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి క్రీడలను ప్రోత్సహించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా అన్నారు. ఆదివారం ఇంద్రాల శ్రీధర్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఉర్దుఘర్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల స్థాయి 2024 రిపబ్లిక్ కప్ ఓపెన్ కరాటే క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్షల్ ఆర్ట్స్‌కు క్రీడలు, సంస్కృతి రంగాలకు అనాదిగా కొత్తగూడెం పట్టణం వేదికగా నిలుస్తుందన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను కనబర్చి ఈ ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలు తెచ్చిపెట్టిన వారు ఎందరో ఉన్నారన్నారు. అనంతరం పాషాను నిర్వాహకులు శాలువతో సన్మానించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బత్తుల సురేష్, వాసు, మురుగన్, శేఖర్, నాగేశ్వరరావు, పవన్‌రెడ్డి, పవన్ పాల్గొన్నారు.

అటవీశాఖ అసోసియేషన్ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

చుంచుపల్లి: అటవీ శాఖ కొత్తగూడెం యూనిట్ అసోసియేషన్ డివిజన్ కమిటీని ఆదివారం అటవీశాఖ కార్యాలయంలో నిర్వహించిన డివిజన్ ఉద్యోగుల సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఫారెస్ట్ డీఆర్‌ఓ బి.రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా బి.మదన్‌లాల్, కార్యదర్శిగా డి.రామ్మూర్తి, కార్యానిర్వాహక కార్యదర్శిగా మడకం వీర్రాజు, సహాయ కార్యదర్శిగా చరణ్, కోశాధికారిగా ఎం.ప్రసాద్‌లను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా భాగ్యనాయక్, రాష్ట్ర కార్యదర్శి జి.రాంసింగ్, తేజావత్ శోభన్, వ్యవహరించారు. కొత్తగా ఎన్నుకోబడిన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ అటవీశాఖ ఉద్యోగుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

సమాజ మార్పులో యువత కీలకపాత్ర


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఇల్లెందు: సమాజ మార్పులో యువత కీలక పాత్ర పోషించాలని ఇల్లెందు సీఐ టి.కరుణాకర్ అన్నారు. ఆదివారం ఇల్లెందు పోలీస్ స్టేషన్లో డీవైఎఫ్ఐ –2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేటి సమాజంలో అనేక రుగ్మతలు ఉన్నాయని, వాటిని రూపుమాపేందుకు ప్రభుత్వంతోపాటు అన్ని సంఘాల్లో ఉన్న యువత నడుం బిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అప్పారావు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కాళంగి హరికృష్ణ, బయ్యా అభిమన్యు పాల్గొన్నారు.

సంఘ సేవా కార్యక్రమాల్లో ముందంజ


కొత్వాలను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పాల్వంచ: సంఘ సేవా కార్యాక్రమాల్లో ఆర్యసమాజం సేవలు ముందుంటాయని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాత పాల్వంచ నందు ఆర్యవైశ్య సమాజం ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ స్థాయి భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 200 మంది పాల్గొనగా విజేతలకు కొత్వాల బహుమతులు అందించారర్మీ కార్యక్రమంలో నిర్వాహకులు గంజి యాదగిరి, ఆంజనేయులు, బాల గంగాధర్, రంగమ్మ, విమలాదేవి, చంద్రకళ, రాధ, శరత్, రమేష్, వెంకట్, కిరణ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్వాలకు సన్మానం..

డీసీఎంఎస్ చైర్మన్‌గా నియామకమైన కొత్వాల శ్రీనివాసరావును పలువురు నాయకులు పాత పాల్వంచలోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, బద్ది కిశోర్, ఎస్‌వీఆర్‌కె.ఆచార్యులు, నయ్యర్, మూర్తి, కందుకూరి రాము, బాదర్ల జోషి, గంధం నర్సింహారావు, బాలాజీ, భట్టు మురళీ తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందజేయాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందు: సింగరేణిలో ఎన్నికల కారణంగా నిలిచిపోయిన కారుణ్య, ఎక్స్‌టర్నల్ నియామక పత్రాలు వెంటనే అందజేయాలని ఆదివారం ఏఐటీయూసీ ప్రతినిధి బృందం జీఎం జాన్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె. సారయ్య, బ్రాంచి కార్యదర్శి ఎండి.నజీర్ అహ్మద్‌లు మాట్లాడుతూ.. తెలంగాణ సాధారణ ఎన్నికలు, సింగరేణి ఎన్నికల నేపథ్యంలో సింగరేణిలో నియామకాలు జాప్యంగా మారాయన్నారు. సింగరేణిలో నాలుగు నెలలుగా మెడికల్ బోర్డు అన్‌ఫిట్ కార్మికుల పిల్లలు, వివిధ ఎక్స్‌టర్నల్ రిక్రూట్‌మెంట్ పోస్టులతో ఎంపికైన అభ్యర్థులు సుమారు 600 మంది వరకు నియామక పత్రాల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. పార్లమెంటు ఎన్నికల కోడ్ రాబోతున్నందున నియామక పత్రాలు జాప్యం కారణంగా నిరుద్యోగులు తీవ్ర దిగ్భ్రాంతికి గురవుతున్నారన్నారు. ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణం అధికారులు తగుచర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు దాసరి రాజారామ్, కె.వెంకటేశ్వర్లు, ముస్తాఫా, సుందర్, గుగులోతు కృష్ణ, మంచాల వెంకటేశ్వర్లు, సంజీవచారీ, నూనె శ్రీనివాస్, భూషనం, బాలాజీ, లచ్చిరామ్, అజ్మీరా కిషన్లర్, దాట్ల శ్రీకాంత్, బట్టు రవి, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శంగా వెంకటయ్య కుటుంబం


మొక్కలు అందజేస్తున్న వెంకటయ్య దంపతులు

సింగరేణి(కొత్తగూడెం): సమాజ శ్రేయస్సుకు అనునిత్యం పరితపిస్తూ, అనేక రకాల కార్యక్రమాలు చేపడుతున్న మొక్కల వెంకటయ్య కుటుంబం సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని సీపీఐ కార్యదర్శి జిల్లా ఎస్‌కే సాబీర్‌పాషా, పీసీసీ సభ్యులు జేబీశౌరి, జాతీయ బాలోత్సవ్ కన్వీనర్ వాసిరెడ్డి రమేష్‌బాబులు అన్నారు. ఇటీవల మొక్కల వెంకటయ్య కుమారుడు రాయి నగేష్‌కుమార్ మృతిచెందగా ఆదివారం ఆయన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సంస్మరణ కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. ఈ సందర్భంగా శోకసంద్రంలో ఉన్నప్పటికీ కుమారుడి జ్ఞాపకార్థం మొక్కలను పంచటం అభినందనీయమన్నారు. అనంతరం వెంకటయ్య, ఆయన సతీమణి లక్ష్మీ కార్యక్రమానికి వచ్చిన వారందరికీ మొక్కలను పంపిణీ చేశారు. వైద్యులు ఉపేందర్ రావు, కృష్ణచైతన్య, ఇరుకు బాబురావు, రామనాథం, డీపీఆర్వో శీలం శ్రీనివాస్, ప్రముఖ కవి బల్లెం సామ్యేల్, జేమ్స్ ఏడ్విన్, లగడపాటి రమేష్, కరీష రత్నకుమారి, నరసింహారావు, లయన్స్ క్లబ్ సభ్యులు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కోలుకుంటున్న కలుషిత ఆహార బాధితులు

ఇల్లెందురూరల్: కలుషిత ఆహారంతో తీవ్ర అస్వస్థతకు గురైన మండలంలోని మర్రిగూడెం గ్రామపంచాయతీ ఎల్లాపురం శివారు రామవరం గ్రామంలోని ఒకే కుటుంబ సభ్యులు ఆదివారం ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శనివారం రాత్రి ఇల్లెందు ఆస్పత్రి నుంచి ఖమ్మం చేరుకున్న బాధితులకు ఖమ్మంలో మెరుగైన చికిత్స అందడంతో ఏడుగురు కోలుకున్నారని బాధితుల బంధువులు తెలిపారు. కమలారాణి, శ్రీరంగం సంపత్, దైద వెంకన్న, సుగుణా రావు, అబ్దుల్ బాసిత్, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

పాల్వంచ: స్థానిక గట్టాయిగూడెం నందు 1997–98 సంవత్సరంలో ఏడో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం సందడి వాతావరణంలో నిర్వహించుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరోజిని, స్వరూపరాణి, రాజేశ్వరి, రేణుకా, పద్మనాభం, శనగ రాంచందర్ రావు, పూర్వ విద్యార్థులు పాలకుర్తి నవీన్ రాజ్, రఫీ, అఫ్సర్ బేగం, షమీమ్, సందీప్, శ్రీకాంత్, కరుణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తోడేస్తున్నారు..

- గుట్టుచప్పుడు కాకుండా మట్టి, ఇసుక తరలింపు


రంగాపురంవద్ద కిన్నెరసాని వాగు నుంచి ఇసుక తీసుకెళ్లిన వాహనగుర్తులు


మట్టి తరలిస్తున్న టిప్పర్

పాల్వంచరూరల్: గృహ, రహదార్ల నిర్మాణాలు పెరగడంతో ఇసుక, మట్టికి మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. ఇదే అదునుగా భావించిన అక్రమదారులు అక్రమంగా రవాణా చేయడంతో వారికి మట్టి, ఇసుక కల్పతరువుగా మారింది. అధికారుల నిర్లక్ష్యాన్ని ఆసరాచేసుకుని లక్షల విలువ చేసే మట్టిని, ఇసుకను అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో పచ్చని చెట్లు కూడా అక్రమ మట్టిదందాలో నేలపాలవుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండానే మట్టి, ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. దీంతో పర్యావరణ పరిరక్షణకు దోహదపడే ప్రకృతి దెబ్బతింటుంది. ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతుంది. కొందరు అధికారులకు అక్రమార్కులకు మట్టి వ్యాపారం కాసుల వర్షం కురిపిస్తుంది. ఈ వ్యవహారంలో సంబంధిత శాఖల అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఎక్కడ నుంచి ఎక్కడికి..

మండల పరిధిలోని తోగ్గూడెం, రంగాపురం, కిన్నెరసాని, కేశవాపురం, బస్వతారాకకాలనీ ప్రాంతాల్లో మట్టి నిల్వలు ఉండటంతో ప్రైవేట్, ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండానే రాత్రి సమయంలో జేసీబీ యాంత్రాల సహాయంతో లారీల ద్వారా మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్నారు. చీకటి పడితే చాలు కిన్నెరసాని, తోగ్గూడెం ప్రధాన రహదారులో మట్టిలారీలు, ఇసుక ట్రాక్టర్లు జోరుగా తిరుగుతున్నాయి. రాజాపురం, కిన్నెరసాని పరిసర గ్రామల పరిధిలోని భూముల నుంచి మట్టిని తరలిస్తున్నారు. కొంతమంది లారీల యజమానులు, కాంట్రాక్టర్లు సిండికేట్‌గా మారి అక్రమ వ్యాపారం చేస్తున్నారు. మట్టి తరలింపు కారణంగా గుట్టల చుట్టూ ఉన్న పచ్చని చెట్లు కూడా అక్రమార్కులు తొలగించి మట్టిరాళ్లను అమ్ముకుంటున్నారు. ఒక్కో లారీ మట్టిని రూ.4 వేల నుంచి 7 వేల వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమార్కులు రాత్రి సమయంలో మొర్రేడు, కిన్నెరసాని వాగుల నుంచి, రైతుల పొలాల నుంచి గుట్టల నుంచి తవ్విన మట్టిని పాల్వంచ పట్టణంతో పాటు కొత్తగూడెం ఇతర పట్టణాలకు గృహ నిర్మాణాలకు, రహదార్ల నిర్మాణాలు, బ్రిడ్జి నిర్మాణ పనులకు తరలిస్తున్నారు. మరికొంతమంది మట్టిని నిర్దేశించుకున్న ప్రాంతాల్లో నిల్వచేసి తర్వాత డిమాండ్‌ను బట్టి అమ్ముకుంటున్నారు.

గతేడాది తోగ్గూడెం, రంగాపురం తదితర ప్రాంతాల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న 22 లారీలకుపైగా పోలీసులు, రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసిన దాఖలాలు కూడా ఉన్నాయి. ఎత్తుపల్లాలు, గుట్టలుగా ఉన్న ప్రదేశంలోని మట్టిని తవ్వడం ద్వారా భూమి చదునువుతుందని కొంతమంది రైతులు మట్టిని ఉచితంగా తవ్వుకునేందుకు అవకాశం కల్పించడంతో ఇదే అదునుగా భావించిన అక్రమదారులు ఇష్టారాజ్యంగా తవ్వడంతో గుట్టలు కనుమరుగువుతున్నాయి.

నిఘాపెట్టాం..

మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి, మొరం, ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటాం. పట్టాభూముల యజమానులు కూడా మట్టిని తరలించుకోవాలంటే ముందుకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రాత్రి సమయంలో నిఘాపెట్టి సిబ్బందిని పెట్రోలింగ్ చేస్తున్నాం. ఇసుక మట్టి అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల ట్రాక్టర్లు, లారీలను పట్టుకుని జరిమానా కూడా విధించడం జరిగింది. అక్రమంగా ఇసుక, మట్టిని తరలిస్తున్నట్లు సమాచారం ఇస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం.

– నాగరాజు, పాల్వంచ తహసీల్దార్